# అడ్జెస్ట్‌మెంట్

– వి.వి.యస్. పద్మప్రియ




"హాయ్ నీరజా!"

"వనజా...నువ్వు...నువ్వేనా! వెంటనే పోల్చుకోలేకపోయాను సుమా!" ముప్ఫయి అయిదేళ్ళకే ముసలమ్మలా తయారైన వనజని ఆపాదమస్తకం వింతగా చూడసాగింది నీరజ.

"బానే వున్నట్టు కనిపిస్తూనే వున్నావ్! అయినా అడగడం ధర్మం కదా! హౌ ఆర్ యూ!" పచ్చికొబ్బరిలాంటి నీరజ వంటిని చూపులతోనే తడిమేస్తూ అడిగింది వనజ, అందుకు ఆమె గులాబీ పెదవులు నవ్వుతో విచ్చుకున్నయ్, "ఫైన్, మరి నువ్వో!"

"నా విషయాలెందుకులే! ముందు నీ విశేషాలు చెప్పు!"

"యీవూళ్ళోనే స్టేట్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా వర్క్ చేస్తున్నాను. పెళ్ళయి ఆరేళ్ళయ్యింది. ఆయనకూడ యిక్కడే రెవిన్యూలో... యిద్దరు పిల్లలు!" హుషారుగా చెబుతున్న నీరజకేసి నీరసంగా చూస్తూ "నీలాగా చెప్పుకునేందుకు నాకేమంత పెద్దగా ఏమీలేవు కాకపోతే సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, ట్రాన్స్‌ఫర్ కారణంగా నాల్నెల్లక్రితమే కర్నూలు నుండి యీవూరొచ్చాను" అన్నది వనజ.

"అలాగా... మరి మీవారు పిల్లలు...!" తనలో పెళ్ళయిన ఆనవాళ్ళకోసంగా వెతుకుతున్న నీరజ కేసి చూస్తూ తలదించుకుంది.

"అమ్మే గనుక నా కూడా లేకుంటే ... ఏకాకిని!"

"వాట్! పెళ్ళే కా...లే...దా! చేసుకోదలచలేదా లేక కోరుకున్న వరుడు దొరకలేదా!"

"మొదట కారణం మాత్రం కాదు నీరజా!" అనేసి ఎటో చూస్తూ ఆలోచించసాగిందామె. "మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన యిద్దరం కలిసి చదువుకున్నాం. చదువయ్యాక చెరోవైపు వెళ్ళిపోయిన యిరువురి నడుమ వుత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా పోయాయి. దరిదాపు తిరిగి పదిహేళ్ళ తర్వాత యిదే కలవడం! కాలేజ్ డేస్‌లో చదువులోనే గాక అందం అలంకరణలలో కూడ ఒకరికొకరం పోటీ పడే తామిద్దర్నీ చూసి "పాలూనీళ్ళూ!" అనేవాళ్ళంతా. నిజంగానే నీరజ జీవితం పాలవెల్లువలా వుంది. తన బ్రతుకే యిలా నీరుగారిపోయింది. సంతోషమే సగం బలం అన్న సామెతలా యిన్నేళ్ళొచ్చినా నీరజ అందం చెక్కు చెదరని కారణం సంతోషం! కాస్తంత ఆలశ్యమైనా పెళ్ళీ పేరంటం అయితేనే అందము ఆనందము. తానందుకు నోచుకోనకనే దిగులుతో దిగ్గుళ్ళుతూ యిలా...!" అనుకుంది నిట్టూర్పు తోటి. "మాటల్లోనే మా యిల్లొచ్చేసింది. లోనికిరా వనజా!" ఆహ్వానిస్తున్న నీరజను అనుసరించింది వనజ.

"మమ్మీ!" అంటూ తల్లిని చుట్టుకుపోయిన పిల్లలు కడిగిన ముత్యాల్లా వున్నారు.

"మావారు!" భర్తని పరిచయం చేసింది.

"నమస్తే!" అంటూన్న విజయ్ ని నిశ్చేష్టురాలై చూసింది వనజ.

ఒకప్పుడు తనని పెళ్ళాడేందుకు ఎంతగానో ప్రాకులాడిన విజయ్.

"ఆఫీసర్నేతప్ప, నీలాంటి అధముడ్ని చేసుకోనంటూ" అతన్నో గడ్డిపోచకింది తృణీకరించింది తను. యిప్పుడు! అతడు తనకన్నా అధికురాలైన ఆఫీసర్ నీరజ భర్తగా...! స్వర్గంలా వున్న ఆ యిల్లు వెక్కిరిస్తున్నట్లనిపిస్తోంది. కారణం! అడ్జెస్ట్‌మెంట్ లేకపోవడం. అవును! అడ్జెస్ట్‌మెంట్‌లోనే ఆనందాన్ని వెదుక్కుంది నీరజ. ఆ ఓర్పు నేర్పు లేక బ్రతుకంతా చీకటి చేసుకుంది తను. ●